# పొద్దుగడవదు

విరామనేది లేకుండా ముప్పయేళ్ళు సర్వీసుచేసి, సాంసారిక బాధ్యతలన్నీ నెరవేర్చి, ఇల్లుకట్టి, పెళ్ళిచేసి, రిటైరయ్యారు సోమయ్య గారు. రిటైరు కావడంవల్ల ఆయనకొక తీవ్రసమస్య వచ్చిపడింది. అదేమిటంటే రోజల్లా కాలక్షేపం కాకపోవడం. ఆయన కొచ్చిన పెద్ద ఇబ్బందల్లా యిదొక్కటే విరామం. డిటెక్టివ్ నవలలు తగినన్ని అచ్చు కావడం లేదు. చదివినవే చదవాలి. చదరంగం, పేకాటఆడిన వాళ్ళతోనే ఆడాలి. అయినా పొద్దు గడవదు.

సోమయ్యగారిది దబ్బపండు వంటి పచ్చటి ఛాయ. లావుగా, పొడవుగా గంభీరంగా వుంటారు. పెద్ద కళ్లు, సగం నెరిసిన మీసాలు, నున్నటి బట్టతల యివన్నీ ఆయనకొ గాంభీర్యానిచ్చాయి. వృద్ధాప్యంలో అడుగుపెట్టగా మధ్య వయస్కుడి లాగానే వుంటారు.

గడచిన జీవితం సఫలమయిందనే తృప్తి ఆయన కళ్లలో కని పిస్తూ వుంటుంది. అది ఆయనకెప్పుడూ మరపురానిది. సర్వీసులో వున్నపుడు తాననుభవించిన పరువూ, ప్రతిష్టా హోదా, డబ్బూ, పలుకు బడి మళ్ళీ తిరిగిరావనే విచారాన్ని కప్పిపుచ్చు కొనేందుకు చేసే ప్రయిత్నం జాగ్రత్తగా గమనిస్తేనే గాని కనబడదు.

ఉదయం లేచింది మొదలు ఆఫీసు గుమాస్తాలు, బంట్రోతులు, ఊళ్లో పరిపాలనా బాధ్యతలు, సహాయం కోరి వచ్చిపోయే వాళ్లు, రాత్రి వరకూ క్షణం తీరిక వుండేది కాదు. కాని ఇప్పుడో.

ఉదయం అయిదోగంటకు లేచి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి, భార్యపోరు పడలేక కొద్దిగా జపం చేసుకుని, ఫలహారం

తీసుకుని, గబ్రున తేన్చుకుంటూ పీధరుగుమీద ఈజీఛైర్‌లో కూర్చుని వార్తాపత్రిక చదవడం పూర్తయ్యేసరికి ఎనిమిదో గంటవుతుంది. ఇళ్ల గోడలమీద, కిటికీలమీద పెంకులమీద తూర్పు దిశనుండి వచ్చిపడే లేత ఎండని కొంతసేపు పరిశీలనగా చూస్తారు. రోజూ చూస్తున్నయెండే కాని చూస్తారు. అయితే ఆలేత ఎండవల్ల ఆయనలో భావోద్రేకం కాని కవితావేశంకాని కలగవు. అంతలో ఒక గ్రామీణ యువతివంకాయ లమ్ముకుంటూ వస్తుంది.

"ఏమిటమ్మీ అవీ" అంటారాయన. "ముళ్ళొంకాయలు బాబూ. ఓ కిలో పడేయమంటారేటి?" అంటూ తట్ట అరుగుమీద దింపుతుంది.

"ఆ పోనిద్దూ అవేం ముదరకాయలో పుచ్చుకాయలో".

"ఏటి బుగతగారూ అలాగంటారు? నేత పింజలు బాబూ, ఎన్న ముద్దలు, జిలేబీలు, గులాబుజాములు ఆ మాటకొస్తే పచ్చివే తినే యొచ్చు బాబూ. ఇప్పుడిప్పుడే తోటలో కోసుకొచ్చాను, సూడండి బాబూ."

"ఊఁ సరుకెలా వున్నా, కబుర్లు మాబాగా చెబుతావే, సరేగానీ, ఎలా ఇస్తావేమిటి?"

"కిలో రూపాయి బాబూ"

"అబ్బో, రూపాయే, ఏమిటమ్మీ యీ రోజుల్లో మనుషులకే లేదు రూపాయి విలువ, వంకాయలకా? రోజురోజుకీ మరీ ఘోరమయి పోతుందమ్మీ"

"మా కష్టం చాలదు బాబూ, ఏటి సెయ్యమంటారు?"

"సరే వెళ్లు అక్కర్లేదులే"

"పొద్దున్నే బోణీ బేరం బాబూ, పోనీ ఎనభై పైసలకిస్తాను ఏసుకోండి"

"అక్కర్లేదమ్మీ. మా పెరట్లో వంగ తోటుంది. నీ పుణ్యమా అనీ రోజూ ఒక అరకిలో కాయలు కాస్తుంది," అంటూ తృప్తిగా చిరునవ్వు నవ్వుతారు.

"సరేలే బాబూ" అంటూ తట్ట తలమీద పెట్టుకుని వెళ్ళిపోతుంది.

మర్నాడు మళ్లీ పిలిస్తే తట్ట అరుగుమీద దించకుండానే మాట్లాడుతుంది. ఇంతలో ఎవడో గడ్డిమోపుల వాడొస్తాడు.

"ఏమిటయ్యా అది" అంటారు సోమయ్యగారు. (ఆయనకు కించిత్తయినా దృష్టిదోషం లేదు.)

"ఎండు గడ్డి బాబూ, పెరట్లో ఓమోపు పడేయమంటారేటి?"

"కొండ గడ్డిలా వుందే"

"ఛీ, ఛీ, ఏటి బాబూ అలాగంటారు? వొరిగడ్డి బాబూ, ఓమోపు పడేమంటారా?"

"ఎంతకిస్తానంటావు"

"మోపు రెండు రూపాయలు బాబూ"

"ఓస్ నువ్వు మరీనురా. రెండు రూపాయ లేమిట్రా, ఎవరైనా నవ్విపోతారు"

"పోనీ ఎంతిస్తానంటారు?"

"నేనెంతా యివ్వను. అది కాదు నేననేది. ధరలెలా మండిపోతున్నాయో చూడంటాను. వంకాయలు కిలో రూపాయి. గడ్డిమోపు రెండు రూపాయలు. మా కాలంలో వెధవ గడ్డిమోపు పావలా, తెలిసిందా? ఈ రోజుల్లో మనిషికి విలువ పెరగ లేదుగాని గడ్డికి పెరిగిపోయిందిరా నాయనా, హరి, హరీ, కాలం మండిపోతుంది"

"పోనీ ఎంతిస్తారో సెప్పండి బాబూ"

"నా కెందుకురా గడ్డి. మాకేం పశువులా, ఏమైనానా? పోయినేడాది పూటకి రెండు సేర్లు పాలిచ్చే గంగిగోవులాంటి ఆవు చచ్చిపోయిందిరా, మళ్ళీ కొనలేదు"

గడ్డిమోపులవాడు మరొక క్షణం కూడా కాలయాపన చెయ్యకుండా వెళ్ళిపోతాడు.

ఇంతలో కాలేజీకెళ్ళే ఎదురింటి డాక్టరుగారమ్మాయి ఆఫీసుకెళ్ళే వీధి చివరి గుమస్తా, రోజూ ఎర్రంచు తెల్లచీర కట్టుకుని బడికి వెళ్ళే పంతులమ్మా, కూలిపనికిపోయే రైలు కళాసీ, అయవారానికి బయలుదేరే నామాల బ్రాహ్మడూ కనిపిస్తారు. వాళ్ళందరినీ నిలబెట్టి, పలకరించి ప్రశ్నలువేసి పంపించి కుర్చీలోంచి లేచేసరికి పదకొండవుతుంది. భోజనానికి వేళవుతుంది. భోజనం చేసి, నిద్రపోయిం తరవాత డిటెక్టివ్ నవల చదివి సాయంత్రం క్లబ్బుకు పోయి వస్తారు. ఎలాగో రోజు గడుస్తుంది.

ఇక్కడికి సరిగ్గా రెండు మైళ్ళదూరంలో ఒక కుగ్రామంలో ఒక ఒక మూల ఒక పూరిగుడిసెలో గవరమ్మకు క్షణం తీరిక లేకుండా పగలల్లా కష్టపడినా రోజులు గడవడం లేదు. భర్త లేడు. తండ్రి లేడు. అన్నదమ్ములేరు. పదేళ్ళ కొడుకున్నాడు, తనుంది. తనూ తన కొడుకూ రోజల్లా పొలంలో కూలిపని చేసుకుంటారు. లేనప్పుడు పేడతో పిడకలు పెట్టి అమ్ముకుంటారు. పెట్టుబడి లేని వ్యాపారం. అందుకే రోజుల తరబడి పిడకలు పెట్టి ఎండబెట్టి అమ్మితే తట్టకు రెండు రూపాయలేనా రావు. కష్టే ఫలే అనే సూక్తికి కాలదోషం పట్టింది. పెట్టుబడితోనే ఫలితం అన్నదే యీనాటి సూత్రం.

ఇల్లూ వాకిలీ లేకపోయినా, నా అన్నవాళ్లు లేకపోయినా, ఒక పూటతిని ఒకపూట లేకపోయినా ఒంట్లో శక్తి సన్నగిల్లి, వయసుకు

మించిన వృద్ధాప్యం వచ్చి బతుకంతా ఎండిన పిడకలాగయిపోయినా గవరమ్మకు బతుకుమీద ఆశపోలేదు. కొడుకును చూసుకొని కలలు కంటుంది. వాడు పెద్దయితే డబ్బు గడిస్తే తను సుఖపడవచ్చు ననుకుంటుంది. ఉన్న కాస్తలో వాడికి ముందు పెట్టి తరువాతే తను తింటుంది పంచప్రాణాలు వాడి మీదే పెట్టుకు బతుకుతూంది.

అయితే వాడికి ఉన్నట్టుండి హఠాత్తుగా జ్వరం వచ్చింది, వచ్చిన జ్వరం తీవ్రమైంది. నాటువైద్యమెంత చేసినా లొంగింది కాదు. రాత్రి తెల్లవార్లు ఒంటిమీద స్పృహ లేదు. గవరమ్మకు కంటిమీద కునుకులేదు. ఈ బిడ్డ బతుకుతాడా? ఎవడ్ని చూసుకు తాను బతుకుతుందో వాడు బతుకుతాడా? గవరమ్మకు బెంగ పట్టుకుంది. అమ్మవారికి మొక్కుకుంది. కన్నీళ్ళతో చీర తడుపుకుంది.

పట్నంలో ఫలానా వీధిలో ఫలానా డాక్టరున్నాడు. వయస్సు మళ్లినవాడు. ఎర్రగా, లావుగా, పొడవుగా వుంటాడు. సగం నెరసిన మీసాలు. బట్టతల. చప్పున పోల్చుకోవచ్చును. చాల మంచివాడు. పేదలంటే దయ. డబ్బుయిస్తే పుచ్చుకుంటాడు, లేకపోతే లేదు. పిలవగానే మోటారుసైకిలేసుకుని వస్తాడు. వెళ్లి పిలుచుకురమ్మని ఊళ్ళో అంతాగవరమ్మకి సలహాయిచ్చారు.

* * *

సోమయ్యగారు యధావిధిగా ఇడ్లీ కాఫీ తీసుకుని వీధరుగుమీద ఈజీచైర్‌లో కూర్చుని వార్తాపత్రిక చదవడం పూర్తిచేశారు. ఆ రోజు చెప్పుకోదగ్గ వార్తలేవీలేవు. సమ్మెలు, సభలు, హార్తాళ్లు, అల్లర్లు, కాల్పులు ఏవీలేవు. మనిషి చంద్రలోకానికి వెళ్లలేదు. ఏదేశంమీద అటంబాంబు పడలేదు. సరిహద్దు సంఘర్షణేదీ జరగలేదు. ప్రపంచమంతా రిటైర్డ్‌లైఫ్‌లా వుంది.

సోమయ్యగారు రోడ్డుమీదపోతున్న కాలేజీ విద్యార్థిని పరిశీలనగా చూస్తున్నారు. విద్యార్థి రోడ్డుమీద నిలుచున్న కుక్కను చూస్తున్నాడు. కుక్క దూరంగావున్న యింకో కుక్కను చూస్తూంది. విద్యార్థి ఆకుక్క మీద రాయి విసురుతాడు. కుక్క వాడిని కరుస్తుంది. వాడు కోపంకొద్దీ మరొకరాయి తీసి కుక్కని గట్టిగా కొడతాడు. దానికి దెబ్బతగిలి అరుస్తుంది. దాని అరుపులకి జనంమూగుతారు. రిటైర్డ్ డిప్టీకలక్టరుగారి కుక్క అది. ఆయన కోపోద్రిక్తుడై పోలీసుల్ని తీసుకొచ్చి విద్యార్థిని అరెస్టు చేయిస్తాడు. విద్యార్థిని అరెస్టు చేసినందుకు కాలేజి విద్యార్థు లంతా సమ్మె చేసి నిరసన ప్రదర్శన జరుపుతారు. పోలీసులమీద రాళ్ల రువ్వడం, పోలీసులు లాటీచార్జి, భాష్పవాయు ప్రయోగం, కాల్పులు, రంగంలోకి రాజకీయనాయకుల ప్రవేశం అప్పుడు పేపర్లో బేనర్ హెడ్‌లైన్ కావలసినన్ని వార్తలు. కాని కుక్క పారిపోయింది. విద్యార్థి కాలేజీకి పోయాడు.

గవరమ్మ ఆందోళనగా ఇళ్ళవేపుచూస్తూ రోడ్డుమీద కనిపించిది.

" ఏవమ్మో, ఏ వూరునీది ? " అని పలకరించారు సోమయ్యగారు.

"డాక్టరుగారిల్లు యిదేనాబాబూ? మా పిల్లోడికి చాలా జ్వరంగావుంది బాబూ. ఒక్కమాటొచ్చి సూడండి నాయనా, మీ పున్నెముంటాది. ఒంటిమీద తెలివి నేకుండ పడున్నాడుబాబూ " అంది గవరమ్మ.

" అయ్యో పాపం జ్వరమా? ఏవూరు నీది ?" ఏవూరో చెప్పింది. " దగ్గరే బాబూ, మీ సేత్తో యింతమందు పోస్తేనేగాని బతకడు బాబూ " అంటూ ప్రాతిమాలింది.

" ఏమిటీ నీ కొడుక్కి జ్వరమా ? నీ కెంతమంది కొడుకులు ? నీ మొగుణ్ని పంపలేకపోయావా ? నువ్వే పరుగెత్తుకుంటూ వచ్చావు. పిల్లవాడి దగ్గర ఎవరైనా వున్నారా ? "

"నా కెవరూనేరు బాబూ. దిక్కుమాలినదాన్ని పొరిగింటోళ్ళకాడ పిల్లాడ్నుంచి వొచ్చినాను బాబూ. నిన్నమద్దినాళ జొరం తలిగింది, రాత్రంతా ఒంటిమీద తెలివినేదు, మూలుగుతూనే వున్నాడు, ఏటో బాబూ, అంతా నా కరమ."

"అదే నమ్మీ ఈ రోజుల్లో ఈ మాయదారి జ్వరాలు హఠాత్తుగా వస్తున్నాయి. మొన్న మా పొరుగు నున్న పాలమ్మి కొడుక్కి వున్నట్టుండి హఠాత్తుగా జ్వరం తగిలింది, బాగా ఎక్కువైంది. డాక్టరు కూడా అదేం జ్వరమో పోల్చుకోలేకపోయాడు. ఆస్పత్రికి తీసుకుపోయారు. కుర్రాడు బతికేడనుకో".

"హమ్మయ్య! ఆ తల్లి చేసుకున్న పున్నెం బాబూ. మీరొక్కసారి దయ సెయ్యండి బాబూ".

"పాపం, నీకొక్కడే సంతానమన్నావుకదూ?"

"అవునుబాబూ, ఉన్న ఒక్కకొడుకునీ బతికించుకోకపోతే నాను బతికుండి ఏటినాభం బాబూ, తమరొక్కసారి సూసి మందియ్యండిబాబూ. కూలో నాలో సేసి అయిదో వదో కూడేసి తమకిచ్చుకుంటాను నాయనా, అలిస్యమయితే ఏంకొంప మునుగుతుందో అని బయంగావుంది బాబూ."

"పోనీ ఆయుర్వేద వైద్యం చేయించలేకపోయేవ్? ఇంగ్లీషు వైద్యం వెంటనే గుణమిస్తుంది కాని శరీరాన్ని పాడుచేస్తుంది. మావాడొకడు ఇలాగే ఇంగ్లీషు మందులు వాడి శరీరం పాడుచేసుకున్నాడు. చివరికి సిద్ధమకరధ్వజంతో వాడి ఒళ్లు బాగుపడింది."

"అదేం వొయిద్యమో నాకు తెలీదు బాబూ. ఒక్కసారి రండి నాయనా మీకాళ్లొట్టుకుంటాను, బాబ్బాబు, అలిస్యం సెయ్యకండి నాయనా, దయ తలచండి బాబూ, మీకు పున్నెముంటాది" అంటూ గవరమ్మ సోమయ్యగారి కాళ్లు పట్టుకోబోయింది.

"అరెరె, ఇదేమిటి? మంచిగొడవే వొచ్చిందమ్మ్మ, ఇంతకీ నేనేం దాక్టర్నికానే, నే నొచ్చి చేసేదేముంది? ఆ ఎదురుగా వున్న ఇంట్లో ఒక దాక్టరున్నాడు తీసుకెళ్లు".

"అయ్యో కొంపతీసేరు బాబూ, మీరు దాక్టరు బాబూ కారా, సెప్పేరుకారేం. ఆ ఇంట్లో ఉన్నారా బాబూ? అంటూ ఆ ఇంటి వేపు తిరిగింది.

"ఆ, ఉన్నాడు, కాని లేడు. ఇప్పుడిప్పుడే మోటారుసైకిలుమీద ఎటో వెళ్లిపోయాడు. చూడలేదూ."

"వెళ్లిపోయారా, కొంపమునిగింది నాయనా. నాకేందారి బాబూ" అంటూ గవరమ్మ నెత్తీ నోరూ కొట్టుకుని ఏడుస్తూ ఇంటికి తిరిగి పోయింది.

ఇంటికెళ్లేసరికి పిల్లవాడికి వైద్యమే అవసరం లేకపోయింది. అసలు ప్రాణంవుంటేగా.